శ్రీమతే రామానుజాయ నమః

# రామానుజ (ఇరామానుశ) నూత్తందాది ప్రశ్నోత్తరి

జ్ఞాన అనుష్ఠానములు అనేవి సాధకులకు పక్షికి ఉండే రెండు రెక్కల వంటివి. జ్ఞానం లేని అనుష్ఠానం గుడ్డిది అని, అనుష్ఠానం లేని జ్ఞానం కుంటిదని విజ్ఞులు చెప్తారు. పెద్దలను చూచి అనుష్ఠానాన్ని తెలుసుకోవడం, దానిని ఆచరించడం సులభమే! కానీ అపారమైన జ్ఞానాన్ని సముపార్జించడం, తత్వాన్ని తెలుసుకోవడం చాలా కష్టం. కోశములను (పుస్తకములు) అధ్యయనం చేయడం నేటి వారికి దుస్సాధ్యం. అలాగని వానిని నిర్లక్ష్యం చేయలేము. ఏదో ఒక రీతిలో ఆయా కోశములలోని విషయములను వివరించడం విజ్ఞులకు విధాయకం. మారిన కాలం, మారిన అభినివేశం దృష్ట్యా ప్రశ్నోత్తరముల రూపంలో జ్ఞానాన్ని పంచడం నేడు విరివిగా జరుగుతూంది. అన్ని శాస్త్రాలకు, భౌతికం, రసాయనం ఇత్యాదులకు అన్నింటికి ప్రశ్నోత్తర రూప గ్రంథములు విపణిలో బహుళముగా కనిపిస్తున్నవి. దానికి గల ప్రజాదరణమును గుర్తించి నేడు రామాయణాది అత్యంత ప్రాచీన కోశములకు కూడా ప్రశ్నోత్తర రూప కోశములు ప్రకాశమునొంది జిజ్ఞాసుల జ్ఞాన తృష్ణను తీర్చుతున్నవి. ఆ రూపంలోనే ద్రవిడ ప్రబంధాలకు కూడా ప్రశ్నోత్తర రూప గ్రంధాలను ఆవిస్కరింపచేసే ప్రయత్నంలో భాగంగా చెన్నై నగరవాసులైన శ్రీమతి సుమతి రామానుజ దాసిగారు ఇరామానుశ నూత్తందాది అనే శ్రీకోశానికి ప్రశ్నోత్తరిని రూపొందించారు. ఈ గ్రంథానికి ఉ.వే. శ్రీమాన్ డాక్టర్ ఈ.ఏ. శింగరాచార్యస్వామి వారు అనుగ్రహించిన, శ్రీ కాంచీ ప్ర.భ. అణ్ణంగరాచార్యస్వామివారి దివ్యార్థ దీపికా వ్యాఖ్యానమునకు అనువాద రూపమైన కోశము ఆధారం. అంతేకాక శ్రీమతి సుమతి రామానుజ దాసి అనేక భాగవతుల కాలక్షేపముల శ్రవణముల ద్వారా సేకరించిన విషయములు కూడా దీనికి ఆధారములు.

ఈ కోశమును శ్రీమతి సుమతి రామానుజ దాసిగారి అనుమతితో అందరికీ అందుబాటులో ఉన్నట్లుగా ప్రకాశింప చేయుటకు ఈ మా ప్రయత్నమును జిజ్ఞాసువులు అందరూ ఆదరింపగలరని, ఇంకను ఇటువంటి కోశములను ఆవిష్కరింప చేయుటకు మమ్ములను ప్రోత్సహించగలరని ఆశిస్తున్నాము.

**సర్వదా భగవద్రామానుజుల సేవలో భాగవత చరణ పాంశులు.**

1. ఈ గ్రంథ రచయిత తిరునామములెవ్వి?

జ. పెరియకోయిల్‌నంబి, శ్రీరంగామృత కవీంద్రులు, తిరువరంగత్తముదనార్.

2. తిరువరంగత్తముదనార్ వంశమేమి?

జ. మూఙ్గిల్ వంశం.

3. అముదనార్ తిరునక్షత్రం ఏమి? వీరికి అముదన్ అనే పేరు ఎట్లా ప్రసిద్ధి అయ్యెను?

జ. వీరి తిరునక్షత్రం 'హస్త'. శ్రీ రామానుజుల శ్రీచరణాలయందు భక్తి, ప్రపత్తి కలవారందరికి నిత్యానుసంధేయం అయ్యే రీతిలో ప్రతి పాశురంలోను 'ఇరామానుశ' అను తిరునామాన్ని కూర్చి 108 పాశురాలు రచించి రామానుజులను కటాక్షించమని ప్రార్థింపగ, వారి అనుమతిని పొంది కూరేశులు మొదలైన ఆచార్యులందరు వేంచేసి ఉండే సభలో పెరియకోయిల్‌నంబి తామే విన్నవింపగ శ్రీ రామానుజులు శిరస్సు ఊగించి చాలా తృప్తిచెంది పెరియకోయిల్‌నంబి వాక్కు అమృతవాక్కు అయినందువల్ల వారికి "అముదన్" అనే పేరు ప్రసిద్ధి అయేటట్లు కటాక్షించారు. కనుక అప్పటి నుండి "పెరియ కోయిల్ నంబి" అను తిరునామం మారి "తిరువరంగత్తముదనార్" అనే తిరునామంగా ప్రసిద్ధి అయ్యింది.

4. ఈ గ్రంథంలో ముఖ్య పాశురాలెన్ని?

జ. 1,2,7,16,31,76,98,105,106,107,108 పాశురాలు.

5. ఈ గ్రంథములో అతి ముఖ్యమైన పాశురమేది?

జ. 7వ పాశురం అతి ముఖ్యమైనదని పెద్దల నిర్వాహం.

6. వీరిని పెరియ కోయిల్ నంబి అని ఎందుకు అంటారు?

జ. శ్రీరంగం కోవెల నిర్వాహకులుగా ఉండుటచేత వీరికి ఈ తిరునామం కలిగినది.

7. మొదటి తనియన్ చేసిన వారెవరు?

జ. "వేదప్పిరాన్ భట్టర్" అనుగ్రహించారు.

8. 'తెన్ పులత్తార్' అనగా ఎవరు?

జ. దక్షిణ దిక్కులో ఉండేవారైన యమకింకరులు. (1వ తనియన్)

9. 'నయమ్' అనగా ఏమి? దీనివల్ల భగవద్రామానుజులెటువంటివారు అని మనకు తెలుస్తుంది?

జ. **నయమ్ అనగా విషయాంతరాలు.** విషయాంతరాల అనుభవంవల్ల కలిగే అల్ప ఆనందాలు అన్నీ క్షుద్రాలని, హేయాలని భావించి ఆశను విడిచి తమను ఆశ్రయించి సేవించే మహానుభావులకు సంసార బంధాన్ని ఛేదించి మోక్షమిచ్చేవారు భగవద్రామానుజులు అని తెలుస్తుంది.(2వ తనియన్)

10. అముదనార్ శ్రీ రామానుజులకు చేసిన విజ్ఞాపనం ఏమి?

జ. దేవరవారి (శ్రీ రామానుజుల) విషయంలో పరమభక్తిని కలవారు తమశక్తికి తగినట్లుగ శబ్దములను ప్రయోగించి తమ తిరునామాలను కీర్తిస్తారు కదా! ఆ తిరునామాలు ఎల్లప్పుడు నా జిహ్వపై ప్రకాశించునట్లు అనుగ్రహించాలి. అది ఒక్కటే నేను చేసే ప్రార్థన. (3వ తనియన్)

11. ఈ గ్రంథమునకు 3వ తనియన్ (శొల్లిన్ తొగైకొణ్డు) ఎవరు వ్రాశారు?

జ. అజ్ఞాత నామధేయులైన అభియుక్తులు (పండితులు).

12. ఈ గ్రంథమును 'శ్రీ' శుభ శబ్దముతో ప్రారంభించారు. ఇదే మాదిరి ఎంబెరుమానార్ గురించి మరో గ్రంథం సంస్కృతంలో శుభ శబ్దముతో ప్రారంభించబడింది. అది ఏ గ్రంథం? ఎవరు చేశారు?

జ. ఈ గ్రంథమును "పూమన్నుమాదు" అని 'శ్రీ' శుభ శబ్దముతో ప్రారంబించినట్లే, మణవాళ మహామునులు తమ ఆచార్యులైన తిరువాయ్మొళి పిళ్ళైగారి కోరికననుసరించి "యతిరాజ వింశతి" అను గ్రంథమును "శ్రీమాధవాంఘ్రి" అని 'శ్రీ' శుభ శబ్దముతో ప్రారంభించారు.

13. అముదనార్ ఎందులకు ఈ గ్రంథమును రెండవసారి రచింపవలసి వచ్చినది?

జ. వీరు మొదటిసారి రచించిన గ్రంథమును ఎంబెరుమానార్లు ఆదరించలేదు. శ్రీరామానుజుల హృదయాన్ని తెలిసిన కూరత్తాళ్వాన్ తమ శిష్యులైన అముదనార్తో "ఆళ్వార్ విషయంగాను, దివ్య ప్రబంధముల విషయముగాను శ్రీ యతి సార్వభౌములకు గల నిష్ఠను తెలుపు విధంగా నుండి నప్పుడు కదా! శ్రీవారు దానిని ఆదరించుట" అని పలికారట. కనుక రెండవసారి రచింపవలసి వచ్చింది.

14. ఈ గ్రంథమునకు మరొక తిరునామమున్నది. ఎందులకట్లా పిలువబడింది?

జ. "భగవద్రామానుజుల శ్రీచరణాలలో భక్తిని కల్గినవారికి ఈ ప్రబంధం సావిత్రి వలె నిత్యానుసంధానం కావాలి" అని ప్రతి పాశురంలోనూ రామానుజ తిరునామాన్ని గూర్చి 108 పాశురాలుగా అముదనార్ అనుగ్రహించారు. "ప్రపన్న సావిత్రి" అని "ప్రపన్న గాయత్రి" అని దీనిని మన పూర్వాచార్యులు వ్యవహరిస్తారు.

15. ప్రథమ పాశురానికి, ద్వితీయ పాశురానికి ఇంచుమించు ఒకే అర్థం. అది ఏమిటి?

జ. ఒకటవ పాశురంలో శ్రీరామానుజులకు నమ్మాళ్వార్ల శ్రీచరణాలలో ఉండే భక్తిని గూర్చి అముదనార్ ప్రస్తావించగా 2వ పాశురంలో తిరుమంగైఆళ్వార్ శ్రీచరణాలలో శ్రీరామానుజులకు కల ప్రావణ్యాన్ని గూర్చి ప్రస్తావించారు.

16. ఆరియన్, శెమ్మైయనగా ఏమి?

జ. ఆరియన్ అనగా ఆచార్యులు (గొప్ప అనుష్ఠానం కలవారు), శెమ్మైయనగా ఋజు స్వభావం కలవారని అర్థం. (ఋజుత్వం అనగా త్రికరణ శుద్ధి).

17. శెన్ని అనగా ఏమి? పత్తి అనగా ఏమి?

జ. శెన్ని అనగా శిరస్సు. పత్తి అనగా భక్తి. (4వ పాశురం)

18. దుష్టుల యొక్క నింద మనకు పొగడ్త అవుతుందని అముదనార్లు ఎలా అంటారు?

జ. దుష్టుల యొక్క నింద మనకు పొగడ్త ఎలా అవుతుంది అంటే "అముదనార్ అనేవారు ఒకరున్నారట. వారు రామానుజనూత్తందాది అనే గ్రంథం వ్రాశారట. ఒక్కొక్క పాశురంలోనూ భగవద్రామానుజులు భగవద్రామానుజులు అని పలికిన మాటనే పలుకుతున్నారట. శాస్త్రాలలో ఫలంగా చెప్పబడిన ఐశ్వర్యం మొదలైన వానిని నిందించి అంతయు శ్రీ రామానుజులే అని అన్నారట. ఇట్లా ఈ నిందలు అముదనార్‌కు రామానుజులయందు భక్తి కలదు కనుక గుణకీర్తనగా భావిస్తున్నారు (5వ పాశురం)

19. భక్తి అనెడి స్వభావమే తమకు లేదని నైచ్యానుసంధానం చేసుకున్నారు ఏ పాశురంలో? వివరించండి?

జ. 6వ పాశురంలో భక్తి అనే స్వభావమే తమకు లేదని, అయ్యో! "మనమా శ్రీ రామానుజుల వారిని స్తుతించదలిచాము!" అని తమను తామే నిందించుకుంటారు. ఎంతోమంది కవులు శబ్దమాధుర్యంతో, అర్థమాధుర్యంతో రచించే వాళ్ళుండగా, మనం రామానుజుల వారికి మంగళాశాసనం చేయడానికి పూనుకుంటినే అనియు, ఇది యేమి నా బుద్ధిహీనత అనియు తమను తామే నొచ్చుకుంటున్నారు.

20. అముదనార్ తమ ఆచార్యుని ఎలా కీర్తించినారు?

జ. అముదనార్ తమ ఆచార్యులైన కూరత్తాళ్వాన్‌ను ముమ్మదములు అనగా విద్యామదం, ధనమదం, కులమదం లేని వారని కీర్తించినారు.

21. దోష త్రయమనగా ఏమి? ఇవి ఎవరికి లేవు? అముదనార్ల ఆచార్యులు తమ ఆచార్యుల నియమాన్ని ఏవిధంగా వినలేదు?

జ. దోష త్రయం అనగా ధనమదం, విద్యామదం, కులమదం. ఈ మూడున్ను కూరేశులకు లేవు. కంచిలో వరదరాజ స్తవాన్ని విన్నపించి నేత్రాలను పొందాలనే వరాన్ని ప్రార్థించమన్న ఆచార్యుల మాట వినకుండ నేను పొందిన ఫలం నాలూరాన్ పొందాలన్నారు 7వ పాశురంలో.

22 ఈ గ్రంథములో అవతారిక ఎంతవరకు ?

జ. 7వ పాశురం వరకు

23. 10వ పాశురంలో పేయాళ్వార్లకేమి తిరునామం?

జ. 'తమిళ్ తలైవన్' – ద్రావిడ భాషకు స్వామి.

24. ఏ ఏ పాశురాలలో ఏ ఏ ఆళ్వార్లను పాడినారు? 8,9,10,11,12 పాశురములలో ఆళ్వార్లను ఒక క్రమంగా పాడుటకు గల కారణమేమి?

జ. 8వ పాశురంలో పొయ్గై ఆళ్వార్లను, 9వ పాశురంలో పూదత్తాళ్వార్లను, 10వ పాశురంలో పేయాళ్వార్లను, 11వ పాశురంలో తిరుప్పాణాళ్వార్లను, 12వ పాశురంలో తిరుమళిశై ఆళ్వార్లను పాడినారు. వీళ్ళందరూ అయోనిజులు. వీళ్ళు ఫలమునిచ్చు పాశురంలో తమ తిరునామం చెప్పుకోలేదు. కనుకనే ఈ క్రమంగా పాడినారు అముదనార్లు.

25. 12, 13 పాశురాలలో తిరుమళిశై ఆళ్వారును, తొండరడిప్పొడి ఆళ్వారును ప్రక్కప్రక్కన పాడినారెందుకు?

జ. తిరుమళిశై ఆళ్వార్లు 4 వేల 700 సంవత్సరాలు జీవించి ఉండి అన్ని మతములలో ప్రవేశించి చూచి, అన్నిటిని నిరసనం చేసి విరాగులైనారు. తొండరడిప్పొడి ఆళ్వారు కూడ దేవదేవితో చేరి కొన్నాళ్ళు విషయ ప్రవణులుగా ఉండిరి. కనుకనే అముదనార్లు ఇట్లా పాడినారు.

26. 13, 14 పాశురాలలో తొండరడిప్పొడి ఆళ్వారు, కొల్లి కావలన్ (కులశేఖరాళ్వార్) గురించి ప్రక్క ప్రక్కన ఎందుకు సాదించారు అముదనార్?

జ. తొండరడిప్పొడి ఆళ్వార్, కులశేఖరాళ్వార్ ఇద్దరూ శ్రీరంగనాథునికే ఈడు పడ్డారు కనుక.

27. 14, 15 పాశురాలలో కులశేఖరాళ్వార్లను, పెరియాళ్వార్లను అముదనార్లు ప్రక్కప్రక్కనే అనుభవించారెందులకు?

జ. ఇద్దరూ పెరుమాళ్లకు మామగార్లు కనుక.

28. 15వ పాశురంలో పాన్మైయన్ అని ఏ ఆళ్వార్లను చెప్తారు?

జ. పెరియాళ్వార్లను.

29. తండ్రి, కుమార్తెల ప్రస్తావన ప్రక్క ప్రక్క పాశురాలలో ఉన్నవి అవి ఏవి? కలి సామ్రాజ్యంలో వేదాన్ని ఉద్ధరించిన వారెవరు?

జ. 15వ పాశురంలో పెరియాళ్వార్లను, 16లో ఆండాళ్ళమ్మను గురించి పాడినారు. కలికాలంలో వేదాన్ని ఉద్ధరించి లోకాన్ని రక్షించినవారు శ్రీరామానుజులు.

30. చోళనాడులో దివ్యదేశములలో శ్రీరంగం కాకుండా మరొక దివ్యదేశం కీర్తించబడినది అది ఏది? ఏ పాశురంలో?

జ. చోళనాడు దివ్యదేశములలో 27వ దివ్యదేశమైన 'తిరుక్కణ్ణమంగై', 17వ పాశురంలో.

31. పై పాశురంలోనే ఒక ఆళ్వారును గురించి చెప్పినారు వారెవరు?

జ. తిరుమంగై ఆళ్వారు.

32. ఏ పాశురంలో చరమనిష్ఠయందు ఆచరణ గల, ఎవరి భక్తులైన శ్రీరామానుజులు 'మనకు శరణం' అని అముదనార్లు చెప్పినారు? ఈ పాశురంలో 'పెరియవర్' అని ఎవరిని సూచిస్తారు?

జ. 18వ పాశురం, చరమనిష్ఠయందు ఆదరణగల మధురకవుల భక్తులైన శ్రీ రామానుజులే మనకు శరణం అని అముదనార్లు అంటారు. ఈ పాశురంలో మధురకవులను 'పెరియవర్' అన్నారు.

33. ఇన్నుమారి (నమ్మాళ్వార్) సాధించిన దీర్ఘశరణాగతి (తిరువాయ్‌మొళి) యే తల్లి, తండ్రి, ఆచార్యుడు అని తలంచు శ్రీరామానుజులే అముదనార్లకు పరమభోగ్యమని సాధించిన పాశురమేది?

జ. 19వ పాశురం.

34. ఎందుకు భగవద్రామానుజులను తనకు అక్షయమైన నిధిగా పోలుస్తారు?

జ. భగవద్రామానుజులు శ్రీమన్నాథమునులను హృదయంలో ఉంచుకొని అత్యంత భక్తితో ధ్యానించేవారు. ఆ నాథమును లెటువంటివారనగా నమ్మాళ్వార్ల అతిమధురమైన తిరువాయ్‌మొజిని, గానం మొదలైన సకల లక్షణాలతోపాటు తెలిసినవారి విషయంలో ప్రీతిని కలవారెవరో, వారి గుణాలను అనుసంధించి ఉజ్జీవించేవారు. కావున వారే తమకు అక్షయధనం అంటారు అముదనార్లు 20వ పాశురంలో.

35. ఎందువల్ల ఈ లోకంలో ఇక నీచుల వాకిటిని ఆశ్రయించి నిలువ వలసిన అవసరం లేదని అముదనార్లు అంటారు?

జ. పరిశుద్ధమైన అనుష్ఠానం కలిగిన యతులకు నాయకులైన ఆళవందార్ యొక్క ఉభయపాదాలనే ప్రాప్యంగా పొంది, లోకులకందరికి స్వామి అయిన భగవద్రామానుజులు నన్ను రక్షించినారు. ఇకపై నిధులను వర్షించే మేఘమా! అని స్తోత్రాలను చేసే నీచుల వాకిటిని ఆశ్రయించి, నిలచి బాధపడను అంటారు అముదనార్లు. (21వ పాశురం)

36. 22వ పాశురంలో అముదనార్ ఇతర దేవతలు రక్షకులు కారని ఏ విధంగా సూచించారు?

జ. బాణాసురుని రక్షించే విషయంలో సుబ్రహ్మణ్యస్వామి, గణపతి, అగ్నిదేవుడు, శివుడు, దుర్గ, జ్వర దేవత వెన్నుచూపి పారిపోయారు. తర్వాత పరమశివుడు భగవానుని వద్దకు వచ్చి పలు రీతులలో ప్రార్థించగా కృష్ణుడు ఆ బాణుని నాల్గు చేతులు విడిచిపెట్టి, మిగిలిన చేతులను ఖండించాడు. కనుక ఇతర దేవతలెవరూ రక్షింపతగరు అని అముదనారు సూచిస్తున్నారు.

37. తి.వా.మొజిలో (1-5-1) "వళివేజులగిన్ ముదాలయ" అను దశకంలో నమ్మాళ్వార్ నైచ్యానుసంధానం చేసినట్లే , 23వ పాశురంలో అముదనార్ నైచ్యానుసంధానాన్ని ఏ విధంగా చేశారు?

జ. శ్రీ రామానుజులను నిధిగా ఆశ్రయించిన కూరేశులు, ముదలియాండాన్‌ల వలే విలక్షణమైన భక్తి నాకు లేదు. మోసం, కపటం నిండిన మనస్సు కలవాడను నేను. వారిని తలవడానికి అర్హుడను కాను. వారిని స్తుతించాలని తలచాను. అయ్యో! అన్యాయం చేశానే! అని అముదనార్ ఇందులో అలమటిస్తున్నారు.

38. అముదనార్లు తను ఏ విధంగా కృతార్థుడ్ని అయ్యానంటారు 24వ పాశురంలో?

జ. చిరకాలంగా సంసారంలో పడి ఉండి పలు చెడ్డపనులను చేసి ఆ కర్మల ఫలంగా పలు జన్మలనెత్తి పడరాని పాట్లుపడినాను. ఇప్పుడు పరమ ఉదారులైన భగవద్రామానుజులు అవతరించి పలు దుర్మతాలను నశింపచేసినట్లే, నా దుష్కర్మలను కూడ సమూలంగా నశింపచేసి, తమ నిర్హేతుక కృపతో తమను దర్శింపచేయగా, దర్శించి కృతార్థుణ్ని అయ్యాను అంటారు అముదనార్లు.

39. శ్రీ రామానుజుల వారిని మేఘంతో పోల్చు పాశురం ఏది?

జ. 25వ పాశురం.

40. మనకు ఉన్న ఏ అర్హతలు భగవద్రామానుజులకు దాసులుగా చేస్తాయని అముదనార్లు అన్నారు?

జ. భగవద్రామానుజులను ఆశ్రయించడానికి ముందు ఏ దోషాలను కలవారమో, ఏ జన్మను కలిగిన వారమో, ఏ నడతను కలిగిన వారమో అవే అంటే ఆ దోషమే, ఆ జన్మమే, ఆ నడతయే మనలను వారికి శేషభూతులుగా (దాసులుగా) చేస్తాయి అని అముదనార్లు 26వ పాశురంలో అంటున్నారు.

41. అముదనార్ శ్రీ రామానుజుల ఔదార్యమును ఏ విధంగా పోల్చినారు?

జ. స్వామీ నీ గొప్పతనాన్ని, దాసుడనైన నా నైచ్యాన్ని కొంచెం కూడ గమనించకుండా, పరమ పాపిష్ఠివాడనైన నా హృదయంలో నీవు ప్రవేశించావు. వశిష్ఠుడు చండాలుని ఇంటిలోకి ప్రవేశించినట్లు నీవు నా హృదయంలో ప్రవేశించడం, పరిశుద్ధమై వెలిగే నీ మహిమకు అవద్యాన్ని కలిగిస్తుందో ఏమో అని భయపడుతున్నానంటారు అముదనార్లు 27వ పాశురంలో.

42. అముదనార్లు ఏ విధంగా ఉజ్జీవన పొందానంటున్నారు 28వ పాశురంలో?

జ. కంసుని చంపిన నీళాదేవి (నప్పిన్నై) నాథుడైన శ్రియఃపతిపట్ల భక్తి లేని పాపులకు దుర్లభులైన భగవద్రామానుజుల కీర్తినే ఈనాడు కీర్తించగలిగిన నేను సాటిలేని ఉజ్జీవనాన్ని పొందినాను అని అంటున్నారు.

43. విధి అనగా నేమి? 29వ పాశురంలో విధికి అర్థమేమి?

జ. విధి అనగా అదృష్టం; శ్రీ రామానుజులవారి అనుగ్రహమే ఇక్కడ విధి అని అనబడుతున్నది.

44. పరమపద ప్రాప్తి మీకు అక్కరలేదా? అని ప్రశ్నించగా అముదనార్లు ఏమని పలికినారు?

జ. “భగవద్రామానుజులు నన్ను తమ దాసునిగా చేసికొన్న తరువాత నాకు మోక్షం లభిస్తేయేమి? ప్రబల నరకాలు కలిగితే ఏమి? నాకు ఏది పరమ ప్రాప్యమో అది లభించింది, చాలు” అని దృఢంగా పలికినారు 30వ పాశురంలో.

45. అముదనార్లు 31వ పాశురంలో తమ అదృష్టం గురించి మనస్సుతో ఏమి పలుకుతున్నారు?

జ. ఈనాటి వరకు మనకు గడిచిన కాలాలు లెక్కపెట్టలేనివి. నడుస్తున్న కాలమంతా (మారి మారి పలు జన్మలలో పుట్టి) తల్లడిల్లి తిరిగే మనం ఈనాడు స్మరణ లేకుండ అకస్మాత్తుగ శ్రీ రామానుజుల శ్రీచరణాలను సేవించగలిగాము. మన అదృష్టం మంచిది అంటూ అముదనార్లు తమ మనస్సుతో ఆనందంతో పలుకుతున్నారు.

46. అముదనార్, మాకు స్వామియైన శ్రీ రామానుజులను ఆశ్రయించిన వారికి తేజస్సు, క్షమాగుణం, కీర్తి, జ్ఞానం, భక్తి వాటంతట అవే వచ్చి చేరును అని ఒక పాశురంలో సాధించారు. అది ఏ పాశురం?

జ. 32వ పాశురం

47. పంచాయుధములు గల పాశురమేది?

జ. 33వ పాశురం. ‘ఆజి’ అనగా శ్రీసుదర్శనం, నందకం అనగా ఖడ్గం, తణ్డు అనగా గద, శారఙ్గమనగా విల్లు, పాంచజన్యం అనగా శంఖం.

48. పంచాయుధాలు శ్రీ రామానుజుల పట్ల ఎలా ఆశ్రయాన్ని పొందినవి?

జ. పంచాయుధాలు వీరిపట్ల ఆశ్రయాన్ని పొందడం అంటే వీరి అభిప్రాయాన్ని గమనిస్తూ ఉండి, వీరు చేయదలచిన కార్యానికి సహకరించడమే. మరొక అర్థం పంచాయుధాలే ఈలోకాన్ని రక్షించడం కోసం భగవద్రామానుజులుగా అవతరించాయి. (33వ పాశురం)

49. కలిదోషాన్ని పోగొట్టినప్పటికీ భగవద్రామానుజుల కల్యాణగుణాలు ప్రకాశించలేదంటారెందులో?

జ. 34వ పాశురంలో. నా అంతులేని పాపాలను అన్నిటినీ చిత్రగుప్తుడు వ్రాసి ఉంచిన పెద్ద పుస్తకాల భారాన్ని బూడిదచేసి, నన్ను కల్మషం లేనివాడుగా చేసి దాసునిగా చేసికొన్నారు అనే విషయం వ్యక్తమైన తరువాతనే వారి కల్యాణగుణాలు ప్రకాశించాయి అంటారు అముదనార్లు.

50. ఎందువల్ల ఈనాటి నుండి పాపాలు తనకు వచ్చి భాదించవు అని అముదనార్ అంటున్నారు?

జ. శ్రీరంగం అని పల్కగానే అంతులేని వ్యామోహాన్ని పొందుతున్న భగవద్రామానుజుల శ్రీచరణ పద్మాలను మరువను అని దృఢమైన నిశ్చయం ఏర్పడిన తర్వాత క్రూరపాపాలు నన్ను ఈనాటి నుండి ఏ విధంగాను ఆక్రమించవు అని 35వ పాశురంలో అంటున్నారు.

51. చేతనులను సంస్కరించే విషయంలో శ్రీ రామానుజుల అనుతాపాన్ని అముదనార్లు 36వ పాశురంలో ఏవిధంగా తెలియజేశారు?

జ. శత్రువులకు భయంకరమైన శ్రీసుదర్శనాన్ని ఆయుధంగా కలవాడై, సకల జీవాత్మలకు శేషి భగవంతుడే అని తెలిసినా కూడ, పాడు సంసారులు ఉజ్జీవించకుండా ఇంకా ఇంకా సంసారాన్నే వృద్ధిచేసుకుంటూ అధోగతిని పొందుతున్నారే, ఈవిధంగా నిత్యసంసారులై చెడిపోతున్నారే! అని అనుతాపాన్ని పొందిన భగవద్రామానుజులు సంసారుల వెంట వెళ్తున్నారు. మనల్ని ఉద్ధరించడానికి వారే స్వయంగా ప్రయత్నిస్తున్నారే! వారి ఈ కల్యాణగుణం కూర్చి మీకు తెలియలేదా? అని అముదనార్ అంటున్నారు. తిరుక్కోట్టియూర్‌నంబిగారి వద్ద విన్న చరమశ్లోకార్థమును ఏకాంతంగా విని, అందరు ఉజ్జీవించాలని గోపురమెక్కి ప్రకాశింపచేసిన కల్యాణగుణాన్ని గూర్చి ఈ పాశురంలో పల్కుచున్నారు.

52. రామాయణమనే భక్తి సముద్రంలో నిత్యవాసం చేయు శ్రీ రామానుజుల దగ్గరకు తనను చేర్చిన విధమును అముదనారు ఎట్లా తెలియజేశారు?

జ. శ్రీ రామానుజ భక్తజనులు నన్ను కటాక్షించారు. అంతకుముందు నేను దేనికీ పనికిరాని అపదార్థంగా పడి ఉన్నాను. అయ్యో! శ్రీ రామనుజ శేషభూతుడైన వ్యక్తి ఈవిధంగా అన్యాయంగా పాడైపోతున్నాడే అని అనుతపించి, వారు నన్ను సంస్కరించి, ఆ భగవద్రామానుజుల శ్రీచరణాల వద్దకు తీసికొనివచ్చి చేర్చి ఉజ్జీవింప చేశారు అని 37వ పాశురంలో తెలియజేశారు.

53. ఇంతకాలం మనకు శ్రీ రామానుజ శేషత్వం లభించక ఇప్పుడు కలుగుటకు గల కారణం ఏమి?

జ. ఇంతకాలం శ్రీ రామానుజ శేషత్వం మనకు నిత్యసిద్ధమై ఉండగా కూడా లభింపక, ఇపుడు వారి శ్రీచరణాలలో చేరగలిగినందుకు వారి నిర్హేతుక కృపయే కారణమై ఉండాలి అని అముదనార్ సాయించారు (38వ పాశురం).

54. అర్థ, పుత్రుల విషయాలలో మునిగి ఉన్న మనలను శ్రీ రామానుజులు ఉద్ధరించిన తీరును అముదనార్లు మనస్సుతో ఎట్లా అన్వయించుకుంటున్నారు?

జ. ధనము, పుత్రులు, భూమి, అందమైన కేశాలు కల్గిన స్త్రీలు అని పల్కుతూ జ్ఞానం పోగొట్టుకుని దుఃఖపడుతున్న మనకు, అజ్ఞానంతో కూడిన క్రూరమైన దుఃఖాలను పోగొట్టి తమ యొక్క అంతులేని గొప్ప కల్యాణగుణాలనే ధ్యానించ గలిగిన జ్ఞానాన్ని అనుగ్రహించిన శ్రీ రామానుజులు చేసే క్షేమాలు, ఓ మనసా! ఈ లోకంలో వేఱు ఎవరికైనా లభిస్తాయా? ఇది మన భాగ్యమే కదా! అని అముదనారు మనస్సుతో అన్వయించు కొనుచున్నారు. (39వ పాశురం)

55. 4 పురుషార్థములలో ముఖ్యమైనది ఏది? పెరుమాళ్ళయందే ఎక్కువ కామం ఉండాలని ఎందుకు శ్రీ రామానుజులు ఉపదేశించారు?

జ. ధర్మ, అర్థ, కామ, మోక్షములనబడే 4 పురుషార్థములలో ముఖ్యమైనది కామం, అదికూడా భగవద్విషయ కామం. ఈ కామ పురుషార్థమునకు మిగిలిన మూడు పురుషార్థములు శేషభూతములు. కామమే ప్రధాన శేషి అయిన పురుషార్థం. అందువల్లనే ఆ కామం కూడా భగవద్విషయంలోనే ఎక్కువ ఉండాలని శ్రీ రామానుజులు ఉపదేశించారు 40వ పాశురంలో.

56. భగవానుని అవతారం కంటే భగవద్రామానుజుల అవతారమే గొప్పది అని అముదనార్ అనడానికి కారణమేమి?

జ. భగవానుడు పలు జాతులలో పలు జన్మలలో జన్మించి, కంటికి తెలియకుండ నిలచి ఉండి, ఆత్మ స్వరూపాన్ని తెలిపినా ఆయనను లక్ష్యపెట్టలేదు. నన్ను, మన మాదిరే కదా జన్మించాడని మూఢులు అవమానిస్తున్నారని పెరుమాళ్ళు బాధపడవలసి వచ్చింది. భగవద్రామానుజులు అవతరించగానే లోకులందరు ఆశ్చర్యకరమైన యథార్థ జ్ఞానాన్ని పొంది ఉజ్జీవించారు.(41వ పాశురం)

57. విషయాంతరాలలో ఎక్కువ ప్రేమ ఉండిన అముదనారుని శ్రీ రామానుజులు ఎట్లు సంస్కరించారు?

జ. స్త్రీల విషయాలలో ప్రేమ వృద్ధి చెంది అనాదికాలంగా నశిస్తున్న నా ఆత్మను నిర్హేతుక కృపచే సంస్కరించారు. 'శ్రీరంగనాథుడే సర్వశేషి' అని ఉపదేశించడమే వారికి కాలక్షేపం. అట్లు శ్రీ రామానుజులచే నేను సంస్కరింపబడడం ఒక్కటే చాలు అని అంటున్నారు 42వ పాశురంలో అముదనార్లు.

58. భగవద్రామానుజుల తిరునామ వైభవాన్ని 43వ పాశురంలో అముదనార్లు ఏ విధంగా సాధించారు?

జ. కలి పురుషుని తరిమిగొట్టు గొప్పతనాన్ని కల శ్రీ రామానుజుల వారి తిరునామాన్ని అనుసంధానం చేయండి. భక్తి అనే మహాసంపద, జ్ఞానం వృద్ధి చెందుతుంది. ఆ తిరునామాలను అనుసంధానం చేయడం ఆరంభించినప్పుడే వాక్కులో అమృతం వ్యాపిస్తుంది. మన పాపాలు పూర్తిగా పోతాయి.

59. లోకంలోని వాళ్లని చూసి అముదనార్లు ఎట్లా వాపోతారు?

జ. ఇయల్, ఇశ్లై, నాడకమ్ అనే సాటిలేని మూడు రకాలైన ద్రావిడమును, నాల్గు వేదములను, లెక్కలేనన్ని ధర్మశాస్త్రార్థములను, లెక్క పెట్టడానికి సాధ్యంకాని కల్యాణగుణాలు కలవారు అయిన శ్రీ రామానుజుల తిరునామాన్ని నమ్మి అభ్యసించినవారు లేరు. శ్రీ రామానుజ నామ సంకీర్తనమే పురుషార్థమని తెలియనివార్తై, మనకు పురుషార్థమేది అని అడుగుతున్నారే? అయ్యో! అని వాపోతారు 44వ పాశురంలో అముదనార్లు.

60. మార్గం అంటే ఏమిటి? ఫలం అంటే ఏమిటి? శ్రీ రామానుజుల విషయంలో వాటి అన్వయం మనకు ఏవిధంగా ఉండాలి?

జ. ఉపాయం అనగా మార్గం, ఉపేయం అనగా ఫలం. ఉపాయం, ఉపేయం భగవద్రామానుజుల శ్రీచరణములే అని నమ్మి ఉండాలి. (45వ పాశురం)

61. బాహ్యమతాలను భంగపరచడం కోసం భగవద్రామానుజులు చేసిన కృషికి అముదనార్ ఏ విధంగా నమస్కరిస్తున్నారు?

జ. 46వ పాశురంలో భగవద్రామానుజులు చేసిన గొప్ప ఉపకారాలు మనస్సులో మధురంగా ఊఱగా ఊఱగా పరవశులై వారి శ్రీచరణాలలో అముదనార్ నమస్కరిస్తున్నారు. నమ్మాళ్వారు అనుగ్రహించిన ద్రావిడ వేదమైన తిరువాయ్మొళిని అభ్యసించి తెలిసినవారైన, అవివేకిని అయిన నేను కూడ బాగుపడునట్లుగా నా మనస్సులోకి ప్రవేశించి, నా సత్తను రక్షించినవారైన, దిక్కులన్నిటిలోను వ్యాపించిన కీర్తిని కలవారైన భగవద్రామానుజులకు నమస్కరిస్తున్నాను.

62. పెరుమాళ్ళ యొక్క 4 ప్రకారములు (స్థితులు) ఉన్న పాశురం ఏది? అవి ఏవి?

జ. 47వ పాశురము. "ఇఱైజ్జప్పడుమ్ పరన్" అనగా పరత్వమును, అరంగన్ అనగా అర్చావతారమును, అఱమ్శెప్పుమ్ అనగా విభవావతారమును, శిన్దై అనగా అంతర్యామిని చెప్పినారు.

63. కుదృష్టి వాదులచే పాడుచేయబడ్డ ధర్మమార్గం మరలా ఎలా స్థిరపడింది?

జ. శ్రీరంగనాధుని శ్రీచరణాలలో గొప్ప భక్తిని కలిగిన భగవద్రామానుజులు ఈ భూలోకంలో అవతరించిన పిమ్మట పూర్వం కుదృష్టి వాదులచే పాడుచేయబడిన ధర్మమార్గం మరల స్థిరపడింది. కలిదోషం కూడా నశించిపోయింది.(49వ పాశురం)

64. భగవద్రామానుజుల శ్రీచరణాలు ఎటువంటివి అని అముదనార్లు వర్ణించారు?

జ. భగవద్రామానుజుల శ్రీచరణాలు ఎటువంటివి అని అంటే వడుగనంబి వంటి వారైన ఉత్తమాధికారులచే ఎల్లప్పుడు మనస్సులో ధ్యానింపబడేవి. శత్రువుల మనస్సు భయపడి పరితపించేటట్లు మాటి మాటి నడిచే స్వభావాన్ని కల్గినవి అని అముదనార్లు 50వ పాశురంలో వర్ణించారు.

65. పంచపాండవుల ప్రస్తావన, రామాయణం ప్రస్తావన ఏ పాశురం లోనిది?

జ. 51వ పాశురం.

66. ఇతర మతములను తల్లడిల్లునట్లుచేసి అముదనార్లను ఎట్లు కటాక్షించారు శ్రీ రామానుజులు?

జ. బాహ్యమతాలైన శాక్య, ఉలూక్య, బౌద్ధ, చార్వాక, పాశుపత, కాణాదములని చెప్పబడిన వాటిని వణుకునట్లు చేసి, ఈ భూమండలమంతా తమ కీర్తి వ్యాపించునట్లు చేసి, ఆత్మగుణాలేమియు లేని నాలో ప్రవేశించి నా పాపాలను పోగొట్టి, శ్రీరంగనాథుని పాదాలలో నన్ను ఆశ్రయింపజేశారు అంటారు 52వ పాశురంలో అముదనార్లు.

67. శ్రీ రామానుజులు అన్ని ఆత్మలకు వాసస్థానమైన అన్ని లోకాలు భగవంతుని సొత్తు అని ఎలా స్మరింపచేశారు?

జ. భగద్రామానుజులు మతాంతరులను ఖండించి, సిద్ధాంతాన్ని స్థాపించి, అందరు కీర్తించడానికి తగిన కల్యాణ గుణాలను కలవారై, ఈ లోకంలో అవతరించి "సకల ప్రాణులు, ఆ ప్రాణులకు వాసస్థానంగా ఉండే సకలలోకాలు శ్రీమన్నారాయణునకే శేషభూతాలు" అనే పరమార్థాన్ని 53వ పాశురంలో స్మరింప చేశారు.

68. శ్రీ రామానుజులకు, సింహమునకు సామ్యం ఎట్లా?

జ. సింహాన్ని కలలో చూచినా సామాన్య మృగాలు నశించిపోతాయి. వాటిని చంపడం కోసం సింహం ఏ ప్రయత్నం చేయనక్కరలేదు. అదే విధంగా బాహ్య కుదృష్టి మతాలను నిరాకరించడం కోసం భగవద్రామానుజులు ఏ ప్రయత్నం చేయకనే వారి స్వభావాలను దర్శించినందు వల్లనే మతాంతరములు అన్నీ నశించిపోయాయి (54వ పాశురం).

69 కోక్కులమ్ అంటే ఎట్టిది? వివరించండి?

జ. శ్రీ రామానుజులను ఆశ్రయించి సేవించే కులం–మా స్వామి కులం. (ఇరామానుశనై త్తొజుమ్ కుడి ఎంగళ్ క్కులమ్) భగవద్రామానుజులు కాదు మాకు స్వామి, వారిని ఆశ్రయించే వారే మాకు స్వామి, 'కో' అను దానికి గొప్పతనం అనే అర్థం ఉన్నందువల్ల "ఎంగళ్ కోక్కులమ్" – మా గొప్పదైన కులం ఎటువంటిదంటే శ్రీరామానుజుల వారిని ఆశ్రయించి సేవించే కులం అంటారు 55వ పాశురంలో అముదనార్లు.

70. భగవద్రామానుజులను ఆశ్రయించిన తర్వాత జీవితం ఎలా ఉంటుందని అముదనార్లు అంటున్నారు?

జ. భగవద్రామానుజులను ఆశ్రయించిన తర్వాత మిగిలిన జీవితకాలం అంతా నేను వేరే ఏ విషయమును నా వాక్కు చెప్పదు, నా మనస్సు భావించదు అని 56వ పాశురంలో అముదనార్లు అంటున్నారు.

71. పరశురాముని ప్రస్తావన ఏ పాశురంలో వస్తుంది? వారి గొప్పతనం ఏమిటి?

జ. 56వ పాశురం. పరశురాముడు తన తండ్రి యొక్క హోమ ధేనువును కార్తవీర్యార్జునుడు అపహరించి, తండ్రిని వధించినందువల్ల అతని కుమారులను చంపి, ఆ కారణం చేత క్షత్రియ కులం మీద కోపంతో లోకంలో పలు రాజులను 21 మార్లు వారితో పోరాడి వధించాడు. ఈ పరశురాముడు ఏడుగురు చిరంజీవులలో ఒకరు. విషాన్ని మింగి, గంగను ధరించి, మెరుపును విల్లుగా వంచి త్రిపుర దాహాన్ని తీర్చి, మన్మథుని దహించి, యముని ఓడించి, సంహార కృత్యాన్ని చేసే ఉగ్రమూర్తి రుద్రుడు. ఆ రుద్రుడు నివసించే కైలాసగిరిని ఒకసారి రావణుడు సమూలంగా పెకలించి పైకి ఎత్తాడు. అంతటి రావణుని కార్తవీర్యార్జునుడు బంధించి చెరలో పెట్టాడు. అతని బాహువులను పరశురాముడు ఖండించి వేశాడు.

72. 57వ పాశురంలో భగవద్రామానుజులు ఎటువంటివారు అని అముదనారు అనుకుంటారు ?

జ. భగవద్రామానుజులు ఎటువంటివారంటే శ్రీరంగనాథుని శ్రీచరణాలలో కైంకర్యం చేసేవారినే తమ ఆత్మ బంధువులుగా గ్రహించడం తప్ప వేఱొక ప్రయోజనం చూడనివారు. ప్రపత్తి అనే గొప్ప తపస్సును చేసేవారిచే పొగడబడేవారు.

73. వేదమును ప్రమాణంగా గ్రహించని అవివేకులపై భగవద్రామానుజులు ఎట్లా విజయం పొందారు?

జ. కుదృష్టులు తాము పల్కినదే వేదాలలోని వాస్తవమైన అర్థమని అపార్థాలను పలుకుతారు. ఆ మూర్ఖులు మాట్లాడు ప్రలాపాలను అన్నిటిని తత్వజ్ఞాన నిధియైన భగవద్రామానుజులు వాదంలో ఖండించి, వాస్తవార్థాన్ని స్థాపించి, విజయాన్ని పొందారు అని 58వ పాశురంలో అముదనార్లు అంటారు.

74. శ్రీమన్నారాయణుడే సర్వశేషి అని అందఱు ఎట్లా తెలిసికొన్నారు ఏ పాశురంలో?

జ. 59వ పాశురంలో దైవాధీనంగా నా స్వామి (శ్రీ రామానుజులు) అవతరించి అంతటా వ్యాపించి ఉండే కలిపురుషుని దోషాలను పోగొట్టి, వేదజ్యోతిని వెలిగించి, అజ్ఞానాంధకారాన్ని పోగొట్టగానే అందఱు శ్రీమన్నారాయణుడే సర్వశేషి అనే పరమార్థాన్ని తెలుసుకొని ఉజ్జీవించడం సాధ్యమైనది అని అముదనార్ అంటారు.

75. శ్రీ రామానుజుల వారికి తిరువాయ్‌మొజి అంటే ఎంత ప్రీతో అముదనార్లు ఏ పాశురంలో తెలియజేశారు?

జ. 60వ పాశురంలో. తిరువాయ్‌మొజి యొక్క పరమభోగ్యమైన రాగం ఎక్కడెక్కడ వినిపిస్తుందో అక్కడంతా భగవద్రామానుజులు వేంచేసి ఉంటారు.

76. శ్రీ రామానుజుల వారి సౌశీల్య, సౌలభ్య గుణములను అముదనార్ ఏ విధంగా తెలిపినారు?

జ. లోకంలో చాలా గొప్పవారు, తమకంటే నీచులై ఉండేవారిని కన్నెత్తికూడ చూడరు. ఇది సహజంగా ఉండే విషయం. ఇక భగవద్రామానుజులను చూస్తే గొప్ప గొప్ప సత్పురుషులచే పొగడబడి మహనీయులైయున్నా, పాపాలతో నిండియున్న నన్ను, తామే స్వయంగా కరుణించి, తమ అంతరంగ కైంకర్యానికి సేవకులుగా చేసికొన్నారు. వారి సౌశీల్యం, సౌలభ్యం మొదలైన గుణాలు ముందుకంటే విశేషంగా వెలిగినవే తప్ప, వారికి ఏ కొరతాలేదు.(61వ పాశురం)

77. 62వ పాశురంలో 'పెరియోర్' అని ఎవరిని చెప్పారు?

జ. 'పెరియోర్ తమ్' అనగా కూరేశులను సూచించారు.

78. ఎంబెరుమానార్లను ఏనుగుతో పోల్చు పాశురమేది? ఏ విధంగా?

జ. పణ్డరుమాఱన్ అను 64వ పాశురం. ఎట్లా అనగా భగవద్రామానుజులనే ఒక మదగజం దుర్వాదులను తరుముటకొరకు ఒక పెద్ద దండమును తీసుకుని ఎదురుగా సమీపంగా వస్తున్నది. దీనికి తప్పించుకొని బయటపడుట ఎవరి వల్లకాదు. వేదమే ఇచట దండముగా చెప్పబడినది. గజరాజుకు మదజలం స్రవిస్తుంది కదా! శ్రీ రామానుజుల వారికి తిరువాయ్‌మొళి అనుభవంవల్ల కలిగిన ఆనంద రసమే మదజలం అని తెలుస్తుంది.

79. భగవద్రామానుజులు ఈ లోకంలో అవతరించిన తర్వాత ఫలించిన అంశాలేవి?

జ. భగవద్రామానుజులు లోకంలో అవతరించి ఉపదేశాల ద్వారా కల్గించిన తత్వజ్ఞానం వల్ల ఫలించిన అంశమేమంటే దుర్వాదుల ఉజ్జీవనం నశించి వైదికుల సంకటాలు తీరిపోయినవి. (65వ పాశురం)

80. శ్రీ రామానుజులవారు కృపామాత్ర ప్రసన్నాచార్యులనుటకు నిదర్శనము గల పాశురం ఏది?

జ. 66వ పాశురం –"జ్ఞానం కనిన్ద నలంకొండు" ఈ పాశురాన్ని చమత్కారంగా చెప్పవచ్చు. మోక్షమనే వస్తువు భగవానుడనే అంగడిలోనూ, భగవద్రామానుజులనే అంగడిలోనూ దొరుకుతుంది. నిత్యం ఉపాసించే వారికే పరమపదాన్ని ఇస్తానంటాడు పెరుమాళ్. కాని మన శ్రీ రామానుజులు అనే అంగడిలో ఈవిధమైన అసౌకర్యాలు లేవు. వారి అనుగ్రహం చాలు. కనుక భగవానుని ఆశ్రయించి కష్టపడకుండా భగవద్రామానుజులను ఆశ్రయించి వారి కృపతో సుఖపడమని లోకులకు అముదనార్ ఉపదేశించారు.

81. శరీరం శాశ్వతం కాదు, ఉజ్జీవించడమే ముఖ్యమని సాయించిన పాశురం ఏది?

జ. తనను శరణు పొందిన ధర్మపుత్రుని కొరకు పడరాని పాట్లుపడి దుర్యోధనాదులను చంపినాడు భగవంతుడు. అట్లు తనను శరణుపొందింది ఉజ్జీవించడం కొరకేగాని విషయాంతరములందు ఆశపడుట కొరకు కాదు, అన్న అర్థాన్ని భగవద్రామానుజులు అవతరించి మనకు ఉపదేశించారు కనుక మనం ఉజ్జీవించగలిగాము. (67వ పాశురం).

82. అర్జునుని రథం ఎవరి అంశ?

జ. గరుడాంశ. అర్జునుని రథమును 'దెయ్‌వత్తేర్' అని అముదనార్లు అన్నారు (68వ పాశురం).

83. ప్రళయకాలంలో పెరుమాళ్ళు కరణకళేబరములు లేనివారికి అవి ఇచ్చారుకాని, ఇవ్వనిదేది?

జ. శ్రీరంగనాథుడు ప్రళయకాలంలో నాకు కరణకళేబరములనిచ్చారుకాని తమ శ్రీచరణముల నివ్వలేదు. ఆ కొరత తీరేందుకు ఎంబెరుమానార్లు తమ శ్రీచరణాలను నాకు ప్రసాదించి ఉద్ధరించారు అంటారు అముదనార్లు. (69వ పాశురం)

84. శ్రీ రామానుజులవారి గొప్ప కరుణను గూర్చి అముదనార్ ఏమని అనుకుంటారు?

జ. 70వ పాశురంలో అముదనారు శ్రీ రామానుజులతో, దాసుల దోషాలను గుణాలుగా భావించి అంగీకరించేవారు మీరు. నాపై నిర్హేతుక కృపను చూపించి అంగీకరించినట్లే, ఇకపై కూడ చేయి విడువకుండా కాపాడాలి. నావద్ద ఏ మంచీ లేదు. ఆ విధంగా మంచిని చూచి రక్షించాలని నిర్బంధం మీరు పెట్టుకుంటే తమ కల్యాణగుణాలకు ఉపయోగమే లేకుండ పోవును అని అంటారు.

85. క్రిందటి పాశురాన్ని అంగీకరించినట్లుగా భగవద్రామానుజులు సాక్షాత్కరింపగా అముదనార్ ఎట్లా సంతోషించారు?

జ. 71వ పాశురంలో అముదనార్లు స్వామీ! నా జ్ఞాన భక్తులు తమ శ్రీచరణాలలో నిలకడగా నిలచి ఉన్నవి. నా కరణాలు దేవరవారి కల్యాణగుణాలలో అభినివేశాన్ని పొంది కైంకర్యం చేయడానికి ఆరంభించినవి. తమ కటాక్షమాత్రంతో నా పూర్వ సంచిత పాపాలన్ని ఎగిరిపోయాయి. అని సంతోషపడుతున్నారు. 102వ పాశురానికి, ఈ పాశురానికి కొద్ది పోలిక ఉన్నది.

86. 72వ పాశురంలో శ్రీ రామానుజుల వారి ఔదార్య గుణాన్ని అముదనార్ ఏవిధంగా వ్యక్తపరిచారు?

జ. స్వామి (ఎంబెరుమానార్), దుష్టమతస్తులను అందరినీ నిరసించి, వేదమార్గాన్ని ప్రతిష్ఠాపనం చేశారు. సత్తలేని వాళ్ళతో కలసి ఉండిన నన్ను సత్త కలవారితో కలిపారు అని సంతోషపడతారు.

87. అముదనార్ తమ అధ్యవసాన్ని 73వ పాశురంలో ఎట్లా తెలిపినారు?

జ. భగవద్రామానుజులను ఎల్లప్పుడు ధ్యానించాలన్న అధ్యవసాయం తప్ప నాకు వేరేమి లేదు. ఎందువల్ల అంటే ఇతరుల దుర్గతిని చూచి భరించలేక, వారు ఎవరూ కోరకుండానే తమకు గల ఔదార్యగుణంవల్ల తామే స్వయంగా రక్షకులై విలక్షణ జ్ఞానాన్ని ఉపదేశించేవారు కదా! అని అముదనార్ తెలిపినారు.

88. ఎంబెరుమాన్ (పెరుమాళ్ళు) కంటే ఎంబెరుమానార్ సౌందర్యమందు అముదనార్ ఏవిధంగా ఈడు పడినారు?

జ. భగవానుడు విలక్షణమైన తన సౌందర్యాన్ని ధరింపజేస్తూ వచ్చి నాకంటెదుట నిలచినా అతని అందంలో నేను మోహించ బోవడం లేదు. భగవద్గుణాలకు నేను అభినివేశాన్ని పొందడం లేదు. "తేవుమత్తఱియేన్" అని మధురకవులు సాధించినట్లు ఇక్కడ అముదనార్లు శ్రీ రామానుజులవారి పట్ల అత్యంత భక్తిని, ప్రీతిని తెలుపుచున్నారు. వారి కల్యాణగుణాలే నన్ను ఆకర్షిస్తున్నవి. (75వ పాశురం)

89. వైకుంఠం, తిరుమల, క్షీరాబ్ది కంటే శ్రీ రామానుజుల తిరువడిగళ్ ప్రీతినిస్తాయని చెప్పు పాశురమేది?

జ. 76వ పాశురం, ఈ గ్రంథములో ముఖ్యమైన 11 పాశురాల ఇది ఒకటి- 'నిన్ఱవణ్ కీర్తియుం'. ఈ పాశురం రోజూ నిద్రలేవగానే సేవించాలని పెద్దలు సాయించారు.

90. అముదనార్లకు శ్రీ రామానుజులు ఇంకా ఏమేమి చేశారు?

భగవద్రామానుజులు నా పాపాలను అన్నిటిని పోగొట్టి తమ పరమకృపకు పాత్రులయేటట్లు చేసినారు. నాకు మాత్రం కాకుండా వేదాలకు బాహ్యమతస్థులు పలికే అపార్థాలకు యదార్థాలు చెప్పి ఖండించారు. అందరిని ఉజ్జీవింప చేశారనే కీర్తి లోకమంతటా వ్యాపించింది. ఇంకా వారికి ఏవో హితములను చాలా చేయాలని ఆశపడుతున్నట్లు తోస్తున్నది అని 77వ పాశురంలో అంటున్నారు.

91. శ్రీ రామానుజులు తనను ఏవిధంగా సంస్కరించారని అముదనార్ భావించారు?

భగవద్రామానుజులు తమను దిద్దుబాటు చేయడం కోసం నాకు తెలియకుండ నా మనస్సులో ప్రవేశించి నిలచి, మనస్సులోని దోషాలను పోగొట్టి భగవద్విషయంలో కింకరునిగా చేశారు. కావున వేరే ఏ విషయమైనా నా మనస్సుకు అంగీకారం కాదు అని అముదనార్ 78వ పాశురంలో అంటున్నారు.

92. అముదనార్ తను ఎవరికి దాసులుగా ఉంటానని చెపుతున్నారు?

అముదనార్ తమ స్థిరమైన నిష్టను గూర్చి 80వ పాశురంలో పల్కుతున్నారు. సత్పురుషులందరు కీర్తించే రీతిలోనే భగవద్రామానుజుల తిరునామాలనే తమకు రక్షకంగా నమ్మిన మహానుభావులనే ఎల్లప్పుడు చింతిస్తూ ఉండే శ్రీ రామానుజ భక్త భక్తులకే దాసుడను నేను అంటున్నారు అముదనార్లు.

93. అముదనార్ శ్రీ రామానుజుల కరుణకు సాటిలేదని ఎట్లా, ఏ పాశురంలో చెప్పారు?

జ. గడచిన పాశురంలో శ్రీ రామానుజ భక్తులకే కైంకర్యం చేస్తానన్న అముదనార్, 81వ పాశురంలో ఇటువంటి స్థిర నిశ్చయం కలిగినదానికి సంతోషపడి, ఈ సంసారంలోనే పడి ఉన్న నన్ను దేవరవారి నిర్హేతుక కృపతో శ్రీరంగనాథుని శ్రీచరణాలకు సేవకునిగా చేశారు. ఇదికదా! వారి సాటిలేని కరుణ.

94. బహుశ్రుతులు అనగా ఎవరు? వివరించండి?

జ. బహుశ్రుతులంటే పలువురు పెద్దల వద్ద పలు మార్లు పలు విషయాలను పలురీతులలో విన్నవారని అర్థం. (82వ పాశురం. ఇది మంచి ఇది చెడు అని తెలియక మహాపాపంవల్ల విపరీతజ్ఞానం కలిగిన, ఎల్లప్పుడు భ్రమలోనే ఉండు నన్ను ఒక్క క్షణంలో భగవద్రామానుజులు గొప్ప అర్థ విశేషాలను ఉపదేశించి "బహుశ్రుతుడు" అనే రీతిగా నన్ను చేసినారే! ఇనుమును బంగారంగా చేసే మహానుభావులెవరున్నారు? "పొరవత్త కేళ్వియనాక్కి నిన్హాన్" అనగా అముదనార్ వలె విషయాలను విన్నవారు ఈ లోకంలో ఎవరూ లేరు అనే రీతిలో చేశారు.

95. దేనిని బట్టి దాసునకు (తనకు) మనస్థైర్యం ఉన్నదంటారు అముదనార్లు?

జ. ఎంబెరుమాన్ (పెరుమాళ్ళు) నియమించినట్లు శరణాగతి అనుష్ఠిస్తే మోక్షమని తలచేవారిలో నేను చేరను. ఆ విధంగా దాసుడనైన నేను దేనినీ అనుష్ఠించలేదు. శ్రీ రామానుజుల శ్రీచరణాలకు మోక్షాన్ని పొందడంలో అడ్డులేదు అనే మనస్థైర్యం దాసునకున్నది అని అముదనార్ అంటున్నారు. (83వ పాశురం)

96. అముదనార్లు శ్రీ రామానుజులను ఎవరు అని తెలుసుకొన్నారు? దానివల్ల ఏమి ఉపయోగం వారికి కలిగింది?

జ. భగవద్రామనుజులు మనవలె ఒక మానవులేనని సామాన్యులు తలుస్తున్నా, నేను ఆ విధంగా భావించలేదు. వీరు మానవులుకారు. లోకాన్ని ఉద్ధరించడం కోసం శ్రీవైకుంఠం నుండి వచ్చి అవతరించిన నిత్యసూరులలో ఒకరు అని తెలుసుకున్నాను. ఆ విషయం తెలిసినాక వారిపట్ల కలిగి ఉండే భక్తి వారి దాసుల పర్యంతం అనువర్తించి వారి భక్తుల శ్రీచరణాలకు సేవచేయగలిగాను. (84వ పాశురం)

97. ఎవరిని శరణ్యులని అముదనార్లు తెలుసుకున్నారు? ఏ పాశురంలో?

జ. 85వ పాశురంలో వేదాంతాలనబడే ఉపనిషత్తులలో సాక్షాత్తుగా చెప్పబడు పెరుమాళ్లను సర్వశేషి అని తెలిసికోలేక దేవతాంతరాలను కొలిచే నీచులైన రాజులను సేవించే, సంసారంలో మునిగి ఉండే సంసారుల అజ్ఞానాన్ని పోగొట్టిన భగవద్రామానుజుల శ్రీచరణాలను సేవించిన మహానుభావులే నాకు శరణ్యులు అని అంటారు అముదనార్లు.

98. అముదనార్ 86వ పాశురంలో తాను ఎవరికి విధేయుడనని అన్నారు?

జ. ఏ ఆపద పోగొట్టడానికైనా, సంపద ఇవ్వడానికైనా శక్తి చాలని వారిని ఆశ్రయించి బాధపడను. గొప్ప శాస్త్రాలను అధ్యయనం చేసిన వారిచే కీర్తింపబడుతున్న శ్రీ రామానుజులను అనుసంధించే మనస్సును కలవారైన మహాత్ములు ఎవరో, ఆ శ్రీ రామానుజుల భక్తులకే నేను విధేయుడనని అముదనార్ అన్నారు. వాళ్ళే మనలను శాశ్వతంగా పాలించే మహానుభావులు అని అముదనార్ భావం.

99. కలి ప్రభావం ఎవరి మీద ఉంటుందని అముదనార్ పలికినారు?

జ. భగవద్రామానుజుల దాసుల విషయంలో కలిపురుషుడు క్రూరభావం చూపడు. శ్రీ రామానుజులు ఉపదేశించిన జ్ఞానాన్ని చెవిలో వేసుకోకుండా నడచుకొనేవారు కలిదోషంవల్ల బాధపడతారని అముదనార్లు 87వ పాశురంలో అంటారు.

100. ఎంబెరుమానార్లను సింహంతో పోల్చు పాశురమేది? ఎందువల్ల?

జ. 'కలిమిక్క శెన్నెల్' అను 88వ పాశురం. తిరుమంగై ఆళ్వారు యొక్క శ్రీసూక్తులను ఎల్లప్పుడు అనుసంధిస్తూ, దానివల్ల మనస్సులో ఆనందాన్ని పొందే భగవద్రామానుజులు ఈ లోకంలో కుదృష్టి మతాలను ఖండించడం కోసం అవతరించారు. ఎట్లనగా కుదృష్టులనే పులులను మ్రింగుట కొరకు వచ్చిన సింహమా అన్నట్లు అవతరించారు.

101. భగవద్రామానుజులను కీర్తించడానికి మనకు యోగ్యత ఉన్నదా! అని నైచ్యాన్ని అనుసరించి అడుగుతారు అముదనారు ఏ పాశురంలో?

జ. 89వ పాశురంలో శ్రీ రామానుజుల వారిని కీర్తించడానికి యోగ్యతలేని మనం ఈ సాహసం చేస్తున్నామే! వారిని నిందించడం కోసమే చేస్తున్నట్లుండును. కనుక నోరు మూసుకుని ఉండాలనుకున్నా మనస్సు వినలేదు. ఇతడు ఆర్తివల్ల కీర్తిస్తున్నాడని దేవరవారు తలుస్తున్నారా? లేక అహంకారంతో పొగడుతున్నాడని బావిస్తున్నారా? ఏమనుకుంటారో అని భయపడుతున్నానంటారు అముదనార్లు.

102. సంసారులు రామానుజుల విషయంలో మనోవాక్కాయముల కార్యాలలో దేనిని చేయకుండా ఉన్నారు అని అముదనార్లు బాధపడుతున్నారు వివరించండి?

జ. సంసారులు భగవద్రామానుజులను మనస్సులో ధ్యానించవచ్చు, వాక్కుతో స్తుతించవచ్చు, వారిని స్తుతించే మహాత్ముల శ్రీచరణాలలో పూవులు సమర్పించడం, నమస్కరించడం చేయవచ్చు. ఇవి ఏమీ సంసారులు చేయడం లేదని 90వ పాశురంలో బాధపడుతున్నారు.

103. సంసారులను ఉజ్జీవింప చేసే విషయంలో భగవద్రామానుజులను గొప్ప పుణ్యాత్ములు అని అముదనార్ అంటారు ఏ విధంగా? ఏ పాశురంలో?

జ. 91వ పాశురంలో పాశుపతులు చెప్పే అర్థాలవల్ల చీకటి కమ్ముకుని పాడైపోయిన లోకం యొక్క అజ్ఞాన అంధకారం తొలగునట్లుగ తనయొక్క విలక్షణమైన కృపను ప్రవహింపచేసి, ఆత్మలన్నిటికి శ్రీరంగనాథుడే స్వామి అను అర్థాన్ని తెలియజేసిన స్వామి భగవద్రామానుజులే గొప్ప పుణ్యాత్ములు.

104. శ్రీ రామానుజులు తనను దాసునిగా అనుగ్రహించడానికి గల కారణం ఏమంటున్నారు అముదనార్లు?

జ. స్వామీ! దేవరవారి మహాత్మ్యం అంతులేనిది. తమ శ్రీచరణాలను కీర్తించడానికి తగిన విషయాలను విన్నవాడను కాను, వినాలనే ఆశ ఉన్నా నోరు తెరచి ప్రస్తావించ లేదు. ఇటువంటి నన్ను ఈనాడు దేవరవారు అనుగ్రహించడం నిర్హేతుక కృపవల్లనే అని అంటున్నారు 92వ పాశురంలో అముదనార్లు.

105. కట్టప్పొరుళ్ అనగా ఏమి? కయవర్ అనగా నేమి?

జ. కట్టప్పొరుళ్ అనగా అపార్థాలు, కయవర్ అనగా కుదృష్టులు అనగా విపరీత అర్థములు చెప్పు దుష్టులు (93వ పాశురం).

106. శ్రీ రామానుజులు భక్త జనులకు శ్రీవైకుంఠమును ప్రసాదించే క్రమమును అముదనార్ జేసిన విధము ఏమి? ఏ పాశురంలో?

జ. 94వ పాశురంలో శ్రీ రామానుజులవారు భక్తజనులకు మొట్టమొదట శరణాగతి నిష్ఠను కల్గిస్తారు. తర్వాత భక్తి అనే సంపదను, తమ కృపను అనుగ్రహిస్తారు. జన్మలను కల్గించే క్రూరకర్మలను పోగొడతారు. అనాదిగా ఉన్న పాపాలను పోగొట్టి చివరలో శ్రీవైకుంఠాన్ని ప్రసాదిస్తారు.

107. సకలాత్మలకు పెరుమాళ్ళ, శ్రీ రామానుజుల అనుగ్రహం ఏ రీతిలో ఉంటుంది?

జ. భగవానుడు స్వతంత్రుడు కనుక నిగ్రహానికి, అనుగ్రహానికి సాధారణుడు. భగవద్రామానుజులు అనుగ్రహమే ఆ రూపాన్ని పొందింది అనేటట్లు ఉన్నవారై, అందరికి ముక్తిని అనుగ్రహిస్తారు. (95వ పాశురం)

108. 'వినై', 'నల్‌వినై', మిక్కనల్ వినై' అనగానేమి? అవి ఎందువల్ల తనకు లభించలేదని అముదనార్లు వాపోయారు?

జ. వినై–సామాన్య భక్తిని, నల్‌వినై–విశేష భక్తిని, మిక్కనల్ వినై – ప్రపత్తిని తెలుపుతాయి.

నా అనాది పాపాలవల్ల నామనస్సులో భక్తి కలుగలేదు. ప్రపత్తికి కావలసిన మహావిశ్వాసం కూడ కలుగలేదు. ఎల్లప్పుడు నీచమైన శరీరాన్ని పోషించుకుని శబ్దాది విషయాలలో పడి ఉన్నాను అని వాపోయారు. ఆ విధంగా ఏ గతియులేని నాకు భగవద్రామానుజ అంతరంగ భక్తులే రక్షకులు కాగలరు అని పలికారు. (96వ పాశురం)

109. భగవద్రామానుజులు తమకు అముదనారుని దాసునిగా చేసుకోకపోవడానికి గల కారణమేమి? ఏ పాశురం?

జ. "అందరూ మనలనే నేరుగా వచ్చి ఆశ్రయిస్తున్నారు తప్ప, నన్ను ఆశ్రయించిన వారిని ఆశ్రయించే వారెవరూ లేరే! ఈ అముదనారు నన్ను ఆశ్రయించిన వారిని ఆశ్రయించే అధికారిగా కానీ!" అని శ్రీ రామానుజులు మనస్సులో సంకల్పించి అలా చేశారు అని అంటారు అముదనార్లు 97వ పాశురంలో.

110. శ్రీ రామానుజులవారు స్వర్గ నరకాలలో చేర్చరని దృఢ అధ్యవసాయంతో మనస్సుతో ఎట్లా చెప్తారు? ఏ పాశురము?

జ. 98వ పాశురం. అముదనార్లు ఎంబెరుమానార్ ఎదురుగానే సాధించారు. మనల్ని స్వర్గంలో చేరుస్తారా, నరకంలో దహింప చేస్తారా, అనాదియైన జన్మలలో నిలుపుతారా, మనలను మనం పోయే దారులలో విడిచిపెడ్తారా? అని ప్రశ్నించుకుని తమ పాదాలలో చేరేటట్లుగా తామే అంగీకరిస్తారు, అందుకోసం నీవు శ్రమ పడవద్దని మనస్సుతో చెప్తారు అముదనారు, (శ్రీరంగంలో కాట్టళగర్ సన్నిధిలో ఒక గట్టుమీద అముదనార్లు కూర్చుని వ్రాయునపుడు శ్రీ రామానుజులు వేంచేసినారు కనుక ఈ పాశురం 2సార్లు సేవించాలని పెద్దల నిర్వాహం).

111. శ్రమణర్, శాక్కియర్, శోమ్బరుం, శూనియా వాదరుం, నీశరుమ్ అనగా ఎవరు?

జ. శ్రమణర్ అనగా తర్కాలు చేయువారు, శాక్కియర్ అనగా బౌద్ధులు, శోమ్బరుం అనగా శైవులు, శూనియ వాదరుం అనగా శూన్యవాదులు, నీశరుమ్ అనగా అపార్థాలు పలికే కుదృష్టులు.(99వ పాశురం)

112. పిడి అనగా ఏమి? కళిర్ అనగా ఏమి? వీటి ప్రస్తావన ఎందులో? పోలిక ఏ పాశురంలోనిది?

జ. పిడి అనగా ఆడ ఏనుగు. కళిర్ అనగా మగ ఏనుగు. ఆడ ఏనుగును వెంబడించే మగ ఏనుగు మాదిరి దాసుడైన నేను సౌశీల్యాది గుణాలు ప్రకాశించే దేవరవారి శ్రీచరణాలను అనుసరించునట్లు కృపచేయాలంటారు అముదనార్లు. 100వ పాశురంలో ఈ పోలిక ఉన్నది.

113. పావనత్వం, భోగ్యత్వం గురించిన పాశురమేది? వివరించండి?

జ. 101వ పాశురం. పావనత్వమనగా భక్తుల పాపాలను పోగొట్టి పరిశుద్ధులు చేయడం. భోగ్యత్వం అనగా ఎల్లప్పుడు అభినివేశంపొంది ఉండడం. పావనత్వం కంటే భోగ్యత్వమే గొప్పది.

114. అముదనార్ తమ ఇంద్రియములతో శ్రీ రామానుజులవారిని అనుభవించాలని ఆశపడుతున్న పాశురం ఏది? ఎలా?

జ. 102వ పాశురం. మనస్సుతో దేవరవారి కల్యాణగుణాలను ధ్యానించాలని, నాలుకతో భగవద్రామానుజా అని పిలవాలనియు, చేతులతో అంజలి చేయాలనియు, నేత్రములతో సేవించాలనియు ఆముదనార్ ఆశపడుతున్నారు.

115. 103వ పాశురంలో చెప్పబడిన ఎంబెరుమాన్ అవతారమేమి? మొదటి పాదంలో చెప్పబడిన వారెవరు?

జ. నరసింహావతారం, మొదటి పాదంలో చెప్పబడినవారు హిరణ్యకశిపుడు.

116. కరతలామలకం అనగా ఏమి? ఈ పదం ఏ పాశురంలో వస్తుంది? కొద్దిగా వివరించండి?

జ. కరతలామలకం అనగా అరచేతిలోని ఉసిరిక పండు (సులభంగా) అని అర్థం. ఈ పదం "కైయిలే కని యెన్న" అనెడి 104వ పాశురంలో వస్తుంది. భగవానుని అరచేతిలో ఉసిరికపండు వలె చూపించి అనుగ్రహించినా, దేవరవారి యొక్క తిరుమేనిలో ప్రకాశిస్తున్న సౌశీల్యాది కల్యాణగుణాలను తప్ప వేరు దేనిని కోరను. సంసారమను బురదలో మునిగి ఉన్నా, పరమపదాన్ని చేరినా, దేవరవారి తిరుమేని అందాన్ని దేవరవారు చూపిస్తేనే కాలు నిలిపి ఈ జగత్తులో ఉండగలను అంటారు అముదనార్లు.

117. క్షీరాబ్ధి పెరుమాళ్ళకంటే ఎవరి యందు అముదనార్లకు ఎక్కువ ఆనందం కలుగును?

జ. క్షీరాబ్ధి పెరుమాళ్ శ్రీచరణాలను సేవించువారు సైతం వారిని వదలి శ్రీ రామానుజులను ఆశ్రయించిన వాళ్ళున్నారు. భగవద్రామానుజులను అనుభవించినందువల్ల కలిగే ఆనందం మిక్కుటమై తల, కాళ్ళు తెలియక ఎక్కడెక్కడ నృత్యం చేస్తారో అక్కడంతా నేనుంటానంటారు అముదనార్లు. (105వ పాశురం)

118. ఈ గ్రంధములో 106వ పాశురం, శెన్నియోంగులో 9వ పాశురమునకున్న పోలిక ఏమిటి?

జ. "ఇరుప్పిడం వైగుందం" అను 106 పాశురంలో శ్రీవైకుంఠం, తిరువేంగడం, తిరుమాలిరుంజోలై మొదలైన దివ్యదేశాలలో వేంచేసియున్న పెరుమాళ్ళు, భగవద్రామానుజుల హృదయంలోకి వేంచేసి నిత్యవాసం చేస్తున్నారు. అటువంటి శ్రీరామానుజులు నా మనస్సులో నిత్యవాసం చేస్తున్నారంటారు అముదనార్లు. క్షీరాబ్ధిని వదలి నా హృదయంలో విరాజిల్లువాడా! క్షీరసముద్రము, సూర్యమండలము, శ్రీవైకుంతము మున్నగువాటిని వదలి నిరాధారునివలె నా హృదయమును వాసస్థలముగ గావించుకొంటివే అని అంటారు పెరియాళ్వార్లు శెన్నియోంగు 9వ పాశురంలో.

119. సమస్త రోగాలకు పుట్టినిల్లయిన దేహమునందు జన్మించుట, మరణించుట; ఎన్ని దుఃఖములు వచ్చినా సర్వకాలము మీ భక్తులకు కైంకర్యం చేయుటకు అనుగ్రహించమని అముదనార్లు ఏ పాశురంలో ప్రార్థిస్తారు?

జ. "ఇన్బుత్త శీలత్తు ఇరామానుశా" అనే 107వ పాశురం.

120. 108వ పాశురంలో తమకు లక్ష్మీదేవి పురుషకారం కావాలంటారు ఎందుకు?

జ. భగవద్రామానుజుల శ్రీచరణ పద్మాల సన్నిధిలో పొందికగా ఉండి ఉజ్జీవించడమే తమకు పరమపురుషార్థంగా అనుగ్రహించినవారు (ప్రథమ పాశురంలో) కనుక, ఆ పురుషార్థం యావజ్జీవం సిద్ధించాలని అన్ని సంపదలను అనుగ్రహించగలిగిన లక్ష్మీదేవి యొక్క పురుషకారం కావాలంటారు అముదనార్లు.

121. శ్రీరంగంలో మూలవర్లను, ఈ దివ్యదేశాన్ని ఎన్నిపాశురాలలో కీర్తించారు? అవి ఏవి?

జ. 15 పాశురములలో కీర్తించారు. అవి 1, 2, 16, 35, 42, 47, 49, 52, 55, 57, 60, 75, 81, 91, 108.

122. శ్రీ రామానుజులు ఖండించిన బాహ్యమతాలేవి? ఏ ఏ పాశురాల ద్వారా తెలుస్తుంది?

జ. జైనులు, బౌద్ధులు, చార్వాకులు, పాశుపతులు, అద్వైతులు, 51, 58, 63, 65, 72, 77, 91, 93, 97, 99.

123. పరాంకుశ నాయకి, పరకాల నాయకి ప్రస్తావన ఏ ఏ పాశురాలలో వస్తుంది?

జ. 1, 18, 19, 29, 64 పాశురాలలో పరాంకుశ నాయకి (నమ్మాళ్వార్); 2, 17, 88 పాశురాలలో పరకాల నాయకి (తిరుమంగై ఆళ్వార్) ప్రస్తావన వస్తుంది.

124. ఒకే పాశురంలో ఒక దివ్యదేశం, ఒక ఆళ్వారును గురించి పాడియున్నారు. ఆ పాశురాలేవి?

జ. 10వ పాశురంలో తిరుక్కోవలూర్ – పేయాళ్వార్లను, 17వ పాశురంలో తిరుక్కణ్ణమంగై – తిరుమంగైయాళ్వార్లను, 88వ పాశురంలో తిరుక్కుఱైయలూర్ – తిరుమంగై ఆళ్వార్లను పాడినారు అముదనార్లు.

125. ఈ గ్రంథములో ఎన్ని దివ్యదేశాలను అముదనార్ కీర్తించినారు?

జ. 11 – దివ్యదేశాలను కీర్తించారు.

126. ఈ గ్రంథమునకు మాత్రం శాత్తుముఱై పాశురాలు మూడుగా ఏర్పడినవి ఎందువల్ల?

జ. అముదనార్ భగవద్రామానుజుల నియమనాన్ని అనుసరించి ఈప్రబంధాన్ని రచించడం కోసం 'అడైయవళైన్దాన్' ప్రాకారానికి ప్రక్కన మండపంలో ఉండి రచించుచుండగా భగవద్రామానుజులు, కూరేశులు, ముదలియాండాన్, ఎంబార్ మొదలైన అంతరంగ శిష్యులతో వేంచేయునప్పటికి "శెజున్దిఱైపార్కడల్" పాశురం ముగించి "ఇరుప్పిడం వైగున్దం" పాశురం (106) రచించవలసిన సమయం. ఆ పాశురం నుండి చివరి మూడు పాశురములు భగవద్రామానుజుల వారి సమక్షంలో రచింపబడ్డాయని అందువల్ల ఈ ప్రబంధానికి మాత్రం శాత్తుపాశురాలు మూడుగా ఉండాలి అని కూరత్తాళ్వాన్ నియమించిరి అని పెద్దల నిర్వాహం.

॥ ఎంబెరుమానార్ దివ్య తిరువడిగళే శరణం ॥